"దేని కేమిటోయ్? ఖర్చుకు. నీ వల్ల చాలా సహాయం కావాలిసిఉంది—మా నాటకం సందర్భంలో."

"సహాయం కావలిస్తే చేస్తాలే," అన్నాడు సత్యం.

"మొహమాటం దేనికోయ్? నీ నాటకం వెంట పట్టుకెళుతున్నాను. దానిమీద ఎడ్వాన్సనుకో."

సత్యం డబ్బు తీసుకున్నాడు. వామనరావు స్థితిలో తానూ, తన స్థితిలో అతనూ ఉంటే తాను ఏదో వంకపెట్టి డబ్బిచ్చి ఉండేవాడా? ఇవ్వా లని తట్టిఉండదు. తట్టినా ఎట్లా ఇవ్వాలో తెలిసి ఉండదు; దారిద్ర్యం అనుభవిస్తున్నా తనకు దానిసంగతి తెలిసినదానికంటె వామనరావుకు బాగా తెలుసు!

అతను ఇంటికి చేరేసరికి జానకి మేలుకునే ఉన్నది.

"ఇంత పొద్దుపోయిం దేమండీ? ఒంటిగా భయపడి చస్తున్నాను. పిల్లాడు ఏడిచిఏడిచి ఇప్పుడే నిద్రపోయినాడు. వాడికి పోతపాలు పొయ్యక జరిగేట్టులేదు. ఏ పూటా కడుపునిండా పాలుండటంలేదు."

సత్యానికి చిరాకు వచ్చింది. కొడుకుపైనా, భార్యపైనా సానుభూతి లేకకాదు; పిల్లవాడికి కడుపునిండా పాలు పొయ్యటంకూడా తన బతుక్కు ఒక పెద్ద సమస్య అయినందుకు.

"మధ్యాన్నం వంట ఏం పెట్టి చేశావు, జానకీ?"

"కావమ్మగారి దగ్గిర అర్థరూపాయి అప్పు చేశాను."

"ఈ పూట ఒక్కత్తెవూ పండుకుతిన్నావా?"

"వంట చెయ్యలేదు. మధ్యాన్నందే మిగిలితే తిన్నాను."

సత్యం జానకిని దగ్గిరికి తీసుకున్నాడు. ఆమె కన్నీరు భుజంమీద వెచ్చగా కారింది.

"ఇదుగో, చూడు!....దినదినగండం వెయ్యేళ్లు ఆయుస్సు!"

జానకి కళ్లు తుడుచుకుంటూ పదిరూపాయలనోటు చూసి, "ఎక్కడిది? ఆయన ఇచ్చా రేమిటి?" అన్నది.

"నాటకానికి ఎడ్వాన్సుకింద ఇచ్చాడు. దాన్ని ఆడిస్తా నంటున్నాడు మరి!"

అతను తన దారిద్ర్యం గ్రహించి ఇచ్చా డని తన భార్య అనుకోవటంకూడా సత్యానికి బాధగానే ఉన్నది.

"ఏమున్నా, ఏంలేకపోయినా పిల్లవాడికి పాలడబ్బామాత్రం రేపు తప్పక తీసుకురండి," అన్నది జానకి.

"తప్పకుండా!" అన్నాడు సత్యం.

పదిరూపాయల నోటు చూసినాక జానకి నరనరానా ఎలాటి మార్పు వచ్చినదీ సత్యం గ్రహించాడు. తనలోకూడా అంత మార్పు రాలేదు. మగవాడి సుఖంకంటెకూడా ఆడదాని సుఖం డబ్బుమీద అధికంగా ఆధారపడి ఉన్నమాట అబద్ధంకాదు....

జానకి అతనికి ఉద్రేకం తెప్పించినదాకా విడిచిపెట్టలేదు. (సశేషం)





# వృథా ప్రయాస



అసలు విషయ మంతా యిలా జరిగింది. నా భార్య. 'ఫిలోమినా' ఇంకా నిద్ర లేవకుండానే నేను తెల్లవారు ఝామునే లేచి పనిముట్లన్నీ తీసుకుని ఒక 'బాయిలర్' మరమ్మత్తు చెయ్యడాని కని బయల్దేరి వెళ్లిపోయాను. రెండు గంటలు పనిచేసి, ఓ గంట వచ్చిపోవడానికీ గడిపి మా యింటి దగ్గిరకి చేరుకున్నాను. మా యిల్లూ దుకాణమూ దగ్గిర్లోనే వున్నై.

నే నిలాగ మా పేటలో కాలుపెట్టానో లేదో నన్నెవరో పిలిచినట్టయింది. ఆ పిలిచింది 'ఫేడే'. ఆమె మా యింటికి యెదురింట్లోనే

మూలం: ఆల్బర్ట్ మొరేవియో
అనువాదం: "అన్నపూర్ణ"

వుంటోంది. ఆమె కాలిమీద మంచం పడిపోయి వాచిపోవడంవల్ల ఏనుగు కాలిమల్లే కనిపిస్తోంది. ఆమె బజారు పూర్తి చేసుకుని ఇంటికి వొస్తోంది. ఆమె సామాన్లను అందుకున్నాను. తోవలో ఆమె నాతో అన్నది—'ఫిలోమినా ఎక్కడుంది?'

'ఎక్కడుంటుంది? — ఇంట్లోనే' —అన్నాను నేను.

'అది సరే' — అన్నదామె. కాని ఆమె మాట్లాడే విధానంలో నాకు సందేహం పొడసూపుతోనేవుంది. ఒక క్షణం ఆగి మళ్ళీ అడిగాను—

'ఏంసంగతి?'

'నీ మీద నాకు జాలేస్తున్నది'— అన్న దాకురూపిణియైన ఫేడే. 'రోజులు మారాయి. నాయవ్వనంనాటిరోజుల్లో పురుషులు నిశ్చింతగా ఇంటినించి వెళ్లగలిగేవారు. తన భార్య నెలా విడిచి వెళ్లేవాడో అలాగే తిరిగి వొచ్చాక చూసేవాడు. కాని ఇప్పుడో—'

'ఇప్పుడేమైంది?'

'ఇప్పుడలా లేదు'—అని తన సామాను తీసుకుని వెళ్లిపోబోయింది. ప్రశాంతమైన ఉదయశోభ నాకు విషప్రాయమైపోయింది. ఆమెని అట్లాగే ఆపి అడిగాను—'విషయమంతా పూర్తిగా చెప్పాలి. ఫిలోమినాకు ఈ ప్రస్తావనతో సంబంధమేమిటి?'

ఆమె అన్నది—"నిన్ను హెచ్చరించాను. మిగిలిన సంగతులన్నీ 'ఎడల్గిసా'ను అడుగు"—అనేసి ఆమె తొందరగా వెళ్లిపోయింది. ఆమె నడక చూస్తే ఆమె కాళ్ల కేరోగమూ లేదనే అనిపిస్తుంది.

'ఎడల్గిసా'కూడా మా పేటలోనే నివసిస్తోంది. నేనటువేపు వెళ్ళాను. మొదట ఆమెతోనే నా వివాహం కావలసింది. అందుచేత ఆమె ఈర్ష్యకొద్దీ ఫిలోమినాపైన యీ అపవాదులన్నీ వేస్తున్నదేమో ననిపించింది.

ఎడల్గిసాను చూడగానే కోపంతో గద్దించాను—'నేను లేని సమయంలో మర్యాదగల స్త్రీలు చెయ్యరాని పనులేవో చేస్తోందని ఫిలోమినాపైయేమో చెబుతున్నావట?'

'లేదు. నేనేం విన్నానో అది చెప్పాను. అంతే!'—అన్నదామె.

'ఎవరినుంచి విన్నావ్?'

'గియెనినా నించి.'

నేను కోపంతో ఆమె యింటినుంచి తిరుగుముఖం పట్టాను. ఫిలోమినా యిట్లాంటిదనే విషయంపై నాకేవిధమైన నమ్మకం కలగలేదు. ఎందుకంటే వివాహమైన యీ మూడేళ్లనించీ ఆమెనించి ప్రేమనే పొందుతున్నాను. కాని ఇప్పుడు మాత్రం నా హృదయం కోపంతో జ్వలిస్తోంది. ఫేడే, ఎడల్గిసా మాటల్ని బట్టిచూస్తే ఫిలోమినా ప్రేమ అంతా నటననీ, విశ్వాసఘాతుక కార్యానికి యీ నటనంతా చాటనీ తోస్తోంది.

గియెనినా ఓ దుకాణంలో పని చేస్తోంది. తన శాంతపూర్వకమైన హుందాతో ఆమె కొనడానికి వొచ్చిన వాళ్లందరితో సౌమ్యంగా వ్యవహరిస్తోంది. నేను మెల్లిగా ఆమెను ప్రశ్నించాను—'ఫిలోమినా గురించి ఈ విషయాన్ని నువ్వు చాటుతున్నావట!'

'ఫిలోమినా అందరికంటె నాకు సన్నిహితమైన స్నేహితురాలు. నేనామెగురించి యిల్లా చాటుతానని మీరనుకుంటున్నారా? ఎడల్గిసాతో మాట్లాడినప్పుడుకూడా నేనేమీ నమ్మడం లేదని అన్నాను. నాతో చెప్పిన వ్యక్తి విసెంజినా. అదే నేను మళ్లీ అన్నాను. అంతే.'

నేను తిన్నగా విసెంజినా లాండ్రీకి చేరుకున్నాను. ఆమె బట్టలు ఇస్త్రీ చేస్తోంది. ఆమెను బయటికి పిలిచాను. చాలసంతోషంతో బైటికొచ్చింది. కాని నా ప్రశ్నవిని ఆమె నిశ్చేష్టురాలైంది.

'అయితే ఆడాళ్లు తమలో తాము మాట్లాడుకోవడంకూడ ప్రమాదమైపోయిందన్నమాట?'

'అయితే నువ్వే యీ విషయాన్ని చాటావా?'

'మిమ్మల్ని చూస్తే నాకు జాలిగా వుంది. ఒకరిపై నేనెందుకు లేనిపోనివి కల్పించాలి? నాతో 'ఎగ్నెస్' చెప్పింది. ఆమెకు అతని పేరుకూడా తెలుసును.'

ఇప్పుడు నాకు తెలిసింది—ఫిలోమినా నన్ను మోసగిస్తోన్నదని. నా భార్యకు పరపురుషుడితో సంబంధమా? ఎంతఘోరం! నా దగ్గరేదీ పెద్ద పనిముట్టు లేకపోయింది. లేకపోతే ఫిలోమినా నెత్తి చిదగ్గొట్టేవాణ్ణి.

ఒక సిగరెట్టుదుకాణంలో 'ఎగ్నెస్' నౌకరుగా పనిచేస్తోంది. పదిహేడేళ్ళ యీ యువతి పైసాకోసం ఏపనయినా చేస్తుందని అందరికీ తెలును. నా భార్యతో ప్రేమకలాపం సాగిస్తోన్న ఆ పురుషుడి పేరేమిటో ఆమెను అడిగాను. మొదట్లో కొంచెం నిరాకరించబోయింది. కాని నేనెప్పుడైతే వెయ్యి 'లీరా' (ఇటలీనాణాలు) ల నోటు చూపించానో ఆమె ముఖం వెంటనే వికసించింది. ఈనోటు ప్రొద్దుట నేనుపడ్డ శ్రమకు లభించిన భత్యం.

నోటును నా చేతిలోంచి లాక్కుని ఆమె అన్నది—"పేరా?—'మారియో' చెప్పిన వ్యక్తి మీ యింటి కాపలా మనిషి."

అయితే ఇది నిజమైందన్నమాట. 'మారియో' పేరును స్మరిస్తో మా

యింటివేపు తిరిగాను. వేలాది 'మారియో' లు నా కళ్ళముందు మెదులు తున్నారు. పాలవాడు మారియో, చాకలి మారియో, కసాయివాడి సుపుత్రుడు మారియో—మారియో, మారియో, మారియో!—రోమ్‌లో వేలకొలదీ మారియో లుంటారు. మా పేటలోనే యెందరో మారియో లుండివుంటారు. తిన్నగా యింటికి రాగానే కాపలా మనిషి గదిలో దూరాను.

ఆ ముసలమ్మను పిలిచి — 'నేను యింట్లో లేనప్పుడు ఫిలోమినా ఎవడో మారియోను యింటికి పిలుస్తున్న దని నువ్వేనా అన్నావుట?' అని గద్దించాను.

ఆమె కోపంతో వెంటనే అందుకుంది.-'ఇ దెవరూ పుట్టించలేదుబాబూ! మీ ఆవిడే స్వయంగా అన్నది. ఆమె వొచ్చి నాతో అందికదా-'మారియో' పేరుగల ఫలానా రూపుగల వ్యక్తి ఇక్కడికి వస్తాడు. ఓవేళ మా ఆయన యింట్లో వుంటే అతన్ని వెళ్ళిపొమ్మని చెప్పు. మా ఆయన లేకపోయివుంటే అతన్ని మేడమీదికి పంపు' — అని చెప్పింది. ఈతుదాన అతను మీ యింట్లో వున్నాడుబాబూ."

"ఇప్పుడున్నాడా?"

"అవును. అతను వొచ్చి ఓ గంట అయింది."

నేను మెట్లెక్కుతో మూడో అంతస్థులోని నా గదిదగ్గిరికి వొచ్చాను. తలుపు తట్టగానే ఫిలోమినా తెరిచింది. ఈ వేళ సహజమైన కాంతి ఆమె ముఖంలో నాకు గోచరించలేదు. ఆమె బెదురుగా కనిపించింది.

"నే నింట్లో లేనప్పుడు మారియో నిన్ను కలవడానికి వొస్తున్నాడా?"

ఆమె యేదో చెప్పడానికి ప్రయత్నించింది. కాని నేను గట్టిగా గద్దించాను—'అంతా నాకు తెలిసిందిలే' అని నేను లోపలికి వెళ్ళిపోతున్నాను. ఆమె నన్ను అడ్డగించి అన్నది—'ఇందులో కోపగించవలసిన విషయ మేమీ లేదు. మీ రింకా అర్థం చేసుకోలేదు. బట్టలు విప్పుకురండి.'

ఇక నన్ను నేనే ఆపుకోలేకపోయినాను. ఆమె చెంపమీద చెళ్ళున ఒక లెంపకాయ వేశాను — 'నా కింకా తెలియలేదుకదూ! ఏమిటది?' ఫిలోమినాను తోసుకుని ఇంట్లోకి వెళ్లాను. మారియో ఎదురుగా కూచుని కాఫీ తాగుతున్నాడు. కాని ఇతను పాలవాడు కాదు. చాకలీ కాదు. కసాయివాడి కొడుకూ కాదు. నాకు తోచిన మారియోలలో ఎవరూ కాదు. ఇతను ఫిలోమినా సోదరుడు — మారియో. ఒక దొంగతనపు కేసులో రెండు సంవత్సరాల జైలుశిక్ష విధింపబడ్డవాడు.



ఫిలోమినాతో చివరకి అన్నాను—"నాయింటో ఆదొంగ అడుగు పెట్టడానికి వీల్లేదు".

కాని ఆదొంగ ఫిలోమినా సోదరుడేగా! ఆమె అతన్ని నా ముందరికి రమ్మని పిలిచింది.

నా కోపంచూసి మారియో లేచి వెళ్లిపోసాగాడు. 'ఏమయిం దీరోజు. నా కేమీ ప్లేగు అంటుకోలేదుగదా!' అన్నాడు.

ఫిలోమినా బయటనించి ఒక తేలిక చూపు విసురుతోంది. నాప్రవర్తనపట్ల నాకే సిగ్గుగా వుంది. మారియోతో అన్నాను—'మారియో! నువ్విక్కడే వుండు. ఇక్కడే భోజనం చెయ్యి. సరేనా ఫిలోమినా?'

ఆమె కళ్ళుతుడుచుకుంటూఒచ్చింది—'మీరనుమతిస్తే నాకేం అభ్యంతరం?'

నేను మారియోను తీసుకుని దుకాణానికి బయలుదేరాను. తోవలో కాపలా మనిషికి మారియోను పరిచయం చేశాను. 'ఇతను నా బావమరిది మారియో! రెండేళ్లనించీ మిలాన్‌లో పని చేస్తున్నాడు. ఇప్పుడు మా దగ్గిరే వుంటాడు.'

ఇంతకీ ఆరోజీలా గడిచింది. వ్యర్థమైందనే చెప్పవచ్చును. వెయ్యి లీరాలను పోగొట్టుకోవడమేగాక ఓదొంగని కూడా యింటోవుంచుకున్నాను. ✻



"అక్కడే ఆ పద్మంమీద నాట్యతారల జంట నృత్యం కోసం వేయించిన బ్రహ్మాండమైన సెట్టు అని వేరే చెప్పనక్కరలేదు."
"ప్రేక్షకుల మెడలు పట్టెయ్యవూ?"